## రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలి

**బీఆర్ఎస్ నేత మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**

శంషాబాద్ రూరల్, జూన్ 1 : రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు శంషాబాద్ పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించే వేడుకలకు మాజీ మంత్రి సబితారెడ్డి పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ మండలాధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. శంషాబాద్‌లో నిర్వహించే పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పండుగగా నిర్వహిస్తామని చెప్పారు.

## జూలై 9న సార్వత్రిక సమ్మెకు సిద్ధం కండి

**ఏఐటీయూసీ పిలుపు**

హిమాయత్ నగర్, జూన్1: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెకు కార్మికులు సిద్ధం కావాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి పిలుపు నిచ్చారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం గత పదేండ్లుగా కార్మికులను బానిసత్వంలోకి నెట్టివేసేందుకు కుట్రలు చేస్తుందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిన కేంద్రం కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. ప్రతి కార్మికవాడలో కార్మిక సంఘాల నేతలు, కార్యకర్తలు తిరిగి ప్రచారం చేసి సమ్మెకు సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు ఐక్యతతో ముందుకు సాగి హక్కులను సాధించుకోవాలని అన్నారు.

# 'మైలార్‌దేవ్‌పల్లి'లో సమస్యలు పట్టవా..!

- నివాసాల మధ్యనే పేరుకుపోతున్న చెత్తాచెదారం
- అసంపూర్తిగా రోడ్ల నిర్మాణం..
- వర్షం పడితే మంచినీటి పైప్‌లోకి కలుషిత నీరు సరఫరా..
- సమస్యలతో సహజీవనం చేస్తున్న ప్రజలు
- మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్



ఆప్కో కాలనీలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలను పరిశీలిస్తున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్, తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 1: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రజలు నిత్యం సమస్యల మధ్య బతుకు వెళ్లదీస్తున్నారని డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్ అన్నారు. శుభోదయం మైలార్‌దేవ్‌పల్లి కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆప్కో కాలనీ, ఆదర్శ కాలనీలలో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .. నివాసగృహాల మధ్యనే రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తుందన్నారు. ప్రజలు ఈ దారి గుండా ముక్కుమూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తరచు అనారోగ్యాలబారిన పడుతూ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. శానిటేషన్ అధికారులు సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. మంచినీటి పైపులైన్‌లు ప్రతి వీధిలో లేకపోవడంవల్ల ఒక్క దగ్గరనే అన్ని కనెక్షన్‌లు ఉండడం వల్ల వర్షం వచ్చినప్పుడు మంచినీటి పైపులైన్‌లో డ్రైనేజీనీరు చేరి కలుషిత నీరు సరఫరా అవుతుందన్నారు. సరైన పైపులైన్ ప్రతి ఇంటికి వేస్తే ఈ సమస్య రాకుండా జాగ్రత్త పడవచ్చునన్నారు. అసంపూర్తిగా రోడ్డు నిర్మాణాలు పనులు వదిలివేయడంతో అస్తవ్యస్తంగా మారాయన్నారు. చిన్న చిన్న ప్యాచ్‌వర్క్ పనులు కూడా పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజలు నిత్యం సమస్యల మధ్య బతుకు వెళ్లదీస్తున్నారన్నారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సరైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

**డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తి చేయరా..?**

పేద ప్రజల కోసం గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌లకు మూడు రంగులు దిద్ది ఇందిరమ్మ ఇండ్లు అని పేరుపెట్టి ప్రజలకు ఇస్తున్నారని బీఆర్ఎస్‌నేత వెంకటేశ్ అన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ 2019లో 300 ఇళ్ల కోసం అప్పటి నగర మేయర్ బొంతు రాంమోహన్‌చే శంకుస్థాపన చేసి ఆరు సంవత్సరాలు పూర్తికావస్తున్నా పనులు మాత్రం పూర్తి కాలేదన్నారు. ప్రభుత్వంచే నిధులు విడుదల చేయించి డబుల్ బెడ్‌రూమ్‌లు సగంలోనే నిలిచిపోవడం వెనుక కొందరు ఉన్నారన్నారు. ఆ బెడ్‌రూమ్‌లు నిర్మించే ప్రాంతమంతా అసంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. అభివృద్ధి కోసమే పార్టీలు మారే ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పనులు ఎందుకు నిలిచిపోయాయో ప్రజలకు చెప్పాలన్నారు. వెంటనే పనులను పూర్తి చేసి ఇండ్లను పేద ప్రజలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాము యాదవ్, యూత్ అధ్యక్షుడు అక్కం రాఘవేందర్‌యాదవ్, రాజేశ్‌యాదవ్, సోమ శ్రీనివాస్‌గుప్తా, మైసిరెడ్డి, ఎడ్లకాడి సూర్యం, జి.రాజు, ప్రవీణ్, చి రంజీవి, రాజు, జగదీశ్, సరిత, మహేశ్, భూ దేవి, అరుణా రెడ్డి, వెంకటరమణ, అశోక్‌కుమార్, సునీల్, భాస్కర్, కార్తీక్‌ముదిరాజ్, రిషి పాల్గొన్నారు.




## ప్రతిభకు సత్కారం..

ఖైరతాబాద్‌కు చెందిన ఓ విద్యార్థిని ఇంటర్ ఒకేషనల్ కోర్సులో ప్రతిభ చాటింది. ఖైరతాబాద్ డబుల్ బెడ్రూంలో నివాసం ఉండే ఆటోడ్రైవర్ సురేశ్ కుమార్, లక్ష్మి దంపతుల కుమార్తె తేజస్విని శంకర్‌పల్లి ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఇంటర్ (ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్) ఒకేషనల్ కోర్సులో వెయ్యికి 992 మార్కులతో రాష్ట్ర మొదటి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా డబుల్ బెడ్రూం గృహ సముదాయంలో ఆదివారం 2బీహెచ్‌కే డిగ్నిటి హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు డీబీ అనిల్ కుమార్ రూ.10వేల చెక్కును ఆమెకు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి విజయ్, ఉపాధ్యక్షులు వెంకటేశ్, యాదగిరి, అశోక్, సాయి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. *– ఖైరతాబాద్, జూన్ 1*

## రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉత్తర్వులు ఇవ్వండి..



ఐసీడీఎస్ డైరెక్టర్ కాంతి వెస్లీకి వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

జూబ్లీహిల్స్, జూన్ 1: అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు ఇస్తామని ప్రకటించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. పదవీ విరమణ ప్రయోజనాల పెంపు ఫైల్‌కు ఆర్థిక శాఖ అనుమతులు ఇచ్చినట్లు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే గతంలో ఇచ్చిన హామీ మేరకు 2024 జులై 1 నుంచి రిటైర్మెంట్ అయిన వారందరికీ దీనిని వర్తింప చేయాలని కోరారు. ఈ మేరకు యూసుఫ్‌గూడ మధురానగర్‌లోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ కార్యాలయంలో ఐసీడీఎస్ డైరెక్టర్ కాంతి వెస్లీకి వినతి పత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద టీచర్‌కు రూ. 2 లక్షలు, హెల్పర్‌కు రూ. 1 లక్ష పెంచాలని, వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ 2024 ఏప్రిల్ నుంచి నాలుగు నెలల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేపట్టామని తెలిపారు. ఫలితంగా సంబంధిత మంత్రి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని 2024 జులై 1 నుంచి వర్తింప చేయాలని కోరారు.

## పదవీ విరమణ పొందిన ఈఈ రాజ్‌కుమార్‌కు సన్మానం



ఈఈ రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న డీసీ జాకియా సుల్తానా, అధికారులు

జూబ్లీహిల్స్, జూన్ 1: ప్రజలను నొప్పించకుండా.. అభివృద్ధి పనులతో మెప్పించగల అధికారులకు ప్రజల అభిమానం ఉంటుందని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా అన్నారు. శనివారం పదవీ విరమణ పొందిన సర్కిల్-19 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజ్ కుమార్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఈఈ రాజ్ కుమార్ చేసిన సేవలను అధికారులు, కాలనీ సంఘాల ప్రతినిధులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ కమల్, డిప్యూటీ ఈఈలు రామచంద్ర రాజు, భానుచందర్, ఏఈలు అవినాష్, భరత్, మధురానగర్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, సంయుక్త కార్యదర్శి హనుమంత రావు, కోశాధికారి సుగుణ, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఆకట్టుకున్న సీతా కల్యాణం హరికథాగానం

యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, ఐఐఎంసీ కళాశాల, మానస ఆర్ట్స్ థియేటర్స్ సంయుక్తాధ్వర్యంలో కళాశాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన సీతా కల్యాణం హరికథాగానం ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమాన్ని దూరదర్శన్ పూర్వ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మానస ఆర్ట్స్ థియేటర్స్ రఘుశ్రీ, తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ నోరి రాజేశ్వర్ రావు, ఐఐఎంసీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ పూర్ణచందర్‌రావు, ప్రిన్సిపాల్ కూర రఘువీర్, యువభారతి వ్యవస్థాపక సమావేశకర్త ఆచార్య వంగపల్లి విశ్వనాథం, వెంకట్రావు, రవీంద్ర నారాయ ణ, రామకృష్ణ, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు. *– ఖైరతాబాద్*

## కళా నీరాజనం-2 సంగీత, నృత్య సమ్మేళనం

రవీంద్రభారతి, జూన్ 1: శ్రీరాగరమ్య కల్చరల్ సోషల్ యాక్టివిటీస్ ఆర్గనైజేషన్(రి)ఆధ్వర్యంలో కళానీరాజనం-2 సంగీత, నృ త్య సమ్మేళనం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాధురి మంగళంపల్లి, రాజేశ్వరి కళానిల యం అధినేత అనూష, అపర్ణ, శ్రియ, మం జుల, డా.ఎం. శాంతిమోహన్ కూచిపూడి నా ట్య నిలయం, శ్రీరాగరమ్య కల్చరల్ సోషల్ యాక్టివిటీస్ వ్యవస్థాపకురాలు రమ్య, కరుణశ్రీ, కీర్తిరెడ్డి, ప్రశాంతి, రాణిప్రియ, రేణుక తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి కళా నీరాజనం-2 సంగీత, నృత్య సమ్మేళనం నృత్య రూపక కార్యక్రమాన్ని ప్రారంభించారు.



సమ్మర్ కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

## విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 1: విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకున్నప్పుడే అన్ని రంగాల్లో రాణించగలరని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి అన్నారు. మైలార్‌దేపల్లి డివిజన్ భవనబుషి నగర్‌లోని శ్రీ మార్కండేయ ట్రస్ట్ భవనంలో విద్యార్థులకు నిర్వహించిన సమ్మర్ కంప్యూటర్ క్యాంప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల్లో సాంకేతిక విద్యపై అవగాహన పెంచేందుకు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక కార్యదర్శి గోంత్యాల శ్రీనివాస్, అడ్వకేట్ దేశాల భూ పాల్, తెలంగాణ రాష్ట్ర సేవా భారతి కిశోరి వికాస్ కార్యదర్శి జయప్రద, తెలంగాణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు ఏర్వ సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కాశిగారి యాదగిరి, రంగారెడ్డి జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు కొంపల్లి జగదీశ్, ఉపాధ్యాయులు మహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## స్పా సెంటర్‌పై పోలీస్ దాడులు

**ఆరుగురు యువతులతో పాటు విటుడు అరెస్ట్**

వెంగళరావునగర్, జూన్ 1: అమీర్‌పేటలోని ఎంఎస్ బ్యూటీ సెలూన్ అండ్ స్పా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించి ఆరుగురు యువతులు, విటుడితో పాటు సబ్ ఆర్గనైజర్ ఉషశ్రీని అరెస్ట్ చేశారు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డుకు చెందిన యాప్రాల్ జ్యోతి, ఉషాశ్రీలు అమీర్‌పేటలోని శాంతి నిలయం అపార్టుమెంట్‌లో స్పా సెంటర్ నిర్వహిస్తున్నారు. ఇందులో గతకొంత కాలంగా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. దీంతో ఇందులో ఆరుగురు యువతులు, చాంద్రాయణగుట్టకు చెందిన విద్యార్థి షేక్ రహీంలను అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం ఎస్ఆర్‌నగర్ పోలీసులకు అప్పగించారు. కాగా ప్రధాన నిందితురాలు జ్యోతి పరారీలో ఉంది.

## ఐక మత్యంతో ఏదైనా సాధించవచ్చు

కాచిగూడ, జూన్ 1: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్నూరుకాపులు ఐక్యత చాటాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, తెలంగాణ ఎక్సైజ్, ప్రొహిబిషన్ న్యాయవాది జగన్ విజ్ఞప్తి చేశారు. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నూతన రాష్ట్ర మున్నూ రు కాపు మహాసభ ప్రమాణ స్వీకారోత్సవం, ఆత్మీయ సమ్మేళనం కాచిగూడ మ్యాడం అంజ య్య హాల్లో నిర్వహించారు. రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడిగా పిల్లి శ్రీనివాసరావుతో పాటు 29 మంది కార్యవర్గ సభ్యులు, 22 మంది నామినేటెడ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

## ప్రమాదకరంగా రేడియల్ రోడ్లు..!

బండ్లగూడ, జూన్ 1: రేడియం రహదారులు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఎంతో లక్ష్యంతో చేపట్టిన ఈ రోడ్ల నిర్మాణం అధికార నిర్లక్ష్యంతో ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఎప్పటికప్పుడు రోడ్లను పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసిచూడనట్టు వదిలేయడంతో ప్రమాదాలకు దారి తీస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. టిప్పుఖాన్ పూల్ బ్రిడ్జి నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న రహదారి వెంట అనేక ప్రాంతాల్లో రోడ్లు గుంతలు పడడంతో పాటు తవ్వకాలు చేపట్టి వదిలేశారు. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే ఎర్రకుంట వద్ద డివైడర్ కొట్టుకుపోయి గుంత ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెంటనే అధికారులు చర్యలు తీసుకొని రేడియల్ రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చడంతో పాటు ఎర్రగుంట వద్ద డివైడర్‌ను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## శౌచాలయాలకు తాళం..!




బండ్లగూడ, జూన్ 1 : బండ్లగూడ జాగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా లక్షల రూపాయలు వెచ్చించి శౌచాలయాలను ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎప్పుడు చూసినా తాళాలు వేసే ఉంటున్నాయి. దీంతో ప్రజలు అత్యవసర సమయాల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే శౌచాలయాల తాళాలు తెరిచి వాటిని వినియోగంలోకి తేవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అలాగే పలు ప్రాంతాల్లో వృథాగా పడిన శౌచాలయ డబ్బాలను తిరిగి వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## కరోనా వైద్య సేవలకు సర్వం సిద్ధం

సుల్తాన్ బజార్, జూన్ 1 : దేశ వ్యాప్తంగా కరోనా కేసులు నమోదవుతున్న తరుణంలో ముందు జాగ్రత్త చర్యగా ఉస్మానియా దవాఖానలో ప్రత్యేకంగా 30 పడకలతో ఐసోలేషన్ వార్డును సిద్ధం చేసినట్లు ఉస్మానియా సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్‌సహాయ్ తెలిపారు. ఇటీవల నగరంలో కరోనా కేసు నమోదైన నేపథ్యంలో దవాఖాన వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్, ఫార్మసీ, మినిస్టీరియల్, నాల్గవ తరగతి సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కరోనా మహమ్మారి విజృంభిస్తుందంటే వ్యాపిస్తున్న వదంతుల నేపథ్యంలో కరోనా రోగులకు అత్యవసర పరిస్థితుల్లో అందించాల్సిన వైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులో కృత్రిమ శ్వాసను అందించేందుకు వెంటిలేటర్లు, పడకల సామ ర్థ్యం, సిబ్బంది, నర్సింగ్ సాంకేతిక సిబ్బంది, మందుల తదితర అంశాలపై చర్చించారు. విపత్కర పరిస్థి తులు ఎదురైతే వైద్య సిబ్బందికి సెలవులు పెట్టకుండా 24/7 అందుబాటులో ఉంచాలని సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్‌సహాయ్ వైద్యసిబ్బందికి సూచించారు. రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు అంబులెన్స్, ఫార్మసీ విభాగాల సార్ సిబ్బంది అందుబాటులో ఉం డాలని సూచించారు.

# శ్రీరామ్ నగర్ సీహెచ్‌సీలో పెరిగిన ప్రసవాలు..

- మొన్నటి వరకు 20.. ఇప్పుడు 60కు చేరుకున్న డెలివరీలు..
- 'నమస్తే' కథనానికి స్పందించి డాక్టర్లను భర్తీ చేసిన కలెక్టర్..
- గర్భిణులకు పెరిగిన ఆదరణ..



దవాఖానలో పండంటి బిడ్డకు జన్మనిచ్చిన తల్లితో డాక్టర్ రమారాణి, వైద్యులు, సిబ్బంది.

జూబ్లీహిల్స్, జూన్ 1: శ్రీరామ్‌నగర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఆదరణ పెరిగింది. మొన్నటి వరకు నెలకు 20 ప్రసవాలు జరుగగా.. అవి మే నెలలో 60కి చేరుకున్నాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పేద మహిళలకు అండగా ఉంటూ కుట్టు లేకుండా సాధారణ ప్రసవాలు నిర్వహించే ఈ ప్రసూతి దవాఖానకు మంచి ఆదరణ ఉండేది. తెలంగాణ ప్రభుత్వ హయాంలో ఈ దవాఖాన గతమెంతో ఘనం.. ఇక్కడ నెలకు 100 ప్రసవాలు దాటుతుండగా దీనిని 150కు చేర్చేందుకు నాటి సూపరింటెండెంట్ డాక్టర్ రమారాణి నేతృత్వంలో దవాఖాన గైనకాలజీ డాక్టర్ల బృందం విశేషంగా శ్రమించింది. దవాఖానను అభివృద్ధి పథంలో నడిపేందుకు సమష్టి కృషి చేశారు. వైద్యుల కృషిని గుర్తించి 30 పడకల దవాఖానను విస్తరించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. మహిళలకు ప్రసవ సమయంలో అవసరం పడితే రక్తం అందించేందుకు బ్లడ్ సెంటర్ ఏర్పాటు కూడా జరిగింది. దవాఖానకు అవార్డులు రావడం.. త్వరలో బెడ్లు విస్తరించే స్థాయికి రావడం జరిగింది. ఆ తరువాత ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడం.. వైద్యుల బదిలీలు, ఖాళీ అయిన పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఇక్కడ క్రమంగా ప్రసవాలు తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 17న 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో వచ్చిన 'ఆరోగ్య కేంద్రానికి ఆదరణ కరువు' శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి క్షేత్ర స్థాయిలో దవాఖానను సందర్శించి.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అప్పటికే అక్కడ పదవీ విరమణ పొందిన సూపరింటెండెంట్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ రమారాణిని పొరుగు సేవల పద్ధతిలో విధుల్లోకి తీసుకొని ఇతర గైనకాలజీ డాక్టర్ల పోస్టులను కూడా అప్పటికప్పుడు భర్తీ చేశారు. జిల్లా కలెక్టర్ చేసిన చికిత్సతో శ్రీరామ్ నగర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో క్రమంగా ప్రసవాలు పెరిగాయి. జనవరి, ఫిబ్రవరి నెలల్లో 28 ప్రసవాలు జరుగగా.. మార్చినెలలో 39.. ఏప్రిల్‌లో 49.. మే నెలలో 60కి చేరుకున్నా యి. దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ నవనీత్ రాజ్ సారథ్యంలో సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ రమారాణి నేతృత్వంలో వైద్యులు, సి బ్బంది కృషితో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మహిళలకు అం డగా ఉండే ఈ ప్రసూతి దవాఖాన పూర్వ వైభవాన్ని సంతరించుకుంది.

**నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం..**

శ్రీరామ్ నగర్ సీహెచ్‌సీ వైద్యులపై ప్రభుత్వం పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. శ్రీరామ్ నగర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పూర్తి స్థాయిలో ప్రసవాలు పెంచుతాం. గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించి దవాఖాన పట్ల మరింత ఆదరణ పెరిగేలా కృషి చేస్తాం. *– డాక్టర్ రమా రాణి, సీనియర్ గైనకాలజిస్ట్, మాజీ సూపరింటెండెంట్*

## 15న ఏపీఎస్పీ మ్యూచువల్లీ ఎయిడెడ్ హౌసింగ్ సహకార సంఘం ఎన్నికలు

జూబ్లీహిల్స్,జూన్ 1: ఏపీఎస్పీ మ్యూచువల్లీ ఎయిడెడ్ హౌసింగ్ సహకార సంఘం ఎన్నికలను ఈనెల 15న హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని పోలీస్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, విశ్రాంత ఉప రిజిస్ట్రార్ ఎన్.వేణుగోపాల్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం బోర్డు డైరెక్టర్‌ల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమ నామినేషన్‌లను పోలీస్ బెటాలియన్ క్వార్టర్ నంబర్-19లో సమర్పించాలని కోరారు. జూన్ 4న ఉదయం 11 నుంచి 4 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. జూన్ 7న ఉదయం 11:30 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన, 8న ఉదయం 11 నుంచి 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. బోర్డు డైరెక్టర్ల ఎన్నికలను పోలీస్‌లైన్‌లోని అన్నపూర్ణ డైనింగ్‌హాల్ వద్ద జూన్ 15న ఉదయం 8 నుంచి 4 గంటల వరకు నిర్వహించి అదేరోజు సాయంత్రం 4:30 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి వెంటనే ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు సంఘం సభ్యులందరూ చురుకుగా పాల్గొనాలని.. మరిన్ని వివరాలకు ఎన్నికల అధికారి మొబైల్ 99599 75363, 95150 11919 లలో సంప్రదించాలని కోరారు.

## బస్‌స్టాప్‌ను మాయం చేసేందుకు యత్నం..!

ఖైరతాబాద్, జూన్ 1 : వ్యాపారాలకు అడ్డువస్తుందని ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్టీసీ బస్‌స్టాప్‌నే మాయం చేసేందుకు కొందరు యత్నిస్తున్నట్లు తెలిసింది. పంజాగుట్ట ప్రధాన రహదారిలో గోకుల్ టవర్స్ ఎదురుగా దశాబ్దాలుగా బస్‌స్టాప్ ఉంది. గతంలో ప్రయాణికులు అక్కడి ఫుట్‌పాత్ పైనే బస్సుల కోసం వేచి చూసేవారు. కూకట్‌పల్లి, అమీర్‌పేట మీదుగా ఖైరతాబాద్ వైపునకు వెళ్లే ప్రయాణికులతో పాటు నిత్యం నిమ్స్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులు ఇదే బస్‌స్టాప్ ను వినియోగించుకుంటారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఇక్కడ బస్‌షెల్టర్‌ను నిర్మించడంతోపాటు స్టీలు కుర్చీ, బస్సుల రూట్‌ను తెలిపే సూచికబోర్డులను ఏర్పాటు చేశారు. ఇటీవల ఓ బేకరి బస్టాప్ వెనుక వెలిసింది. తమ వ్యాపారాలకు అడ్డుగా ఉందని భావించి బస్‌స్టాప్‌నే తొలగించే కార్యక్రమం జరుగుతున్నట్లు తెలిసింది.



పంజాగుట్ట ప్రధాన రహదారిపై ఉన్న ఆర్టీసీ బస్టాప్

తొలుత సూచికబోర్డులు మాయమయ్యా యి. శనివారం బస్టాప్‌లో ఉన్న స్టీలు సీట్లు సైతం కనిపించకుండా పోయాయి. ఆర్టీసీ, పోలీసు అధికారులు దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## లుద్మిల సాగర్ పిల్లా భారతనాట్య అరంగేట్రం

రవీంద్రభారతి, జూన్ 1 : నాట్యగురువు ప్రియ వెంకటరామన్ శిష్యురాలు లుద్మిల్ల సాగర్‌పిల్లా భరత నాట్య అరంగేట్రం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. 12వ తరగతి చదువుతున్న విద్యార్థిని అయిన లుద్మిల సాగర్‌పిల్లా 2016లో భరత నాట్యం మొదలుపెట్టింది. చదువుతో పాటు బాస్కెట్ బాల్‌లో కూడా రాణిస్తున్నది. న్యూఢిల్లీలోని సీఆర్ పార్కులో దుర్గాపూజోత్సవాల సందర్భంగా తన గురువుతో కలసి ప్రదర్శన ఇచ్చే అవకాశం లభించింది. లుద్మిల్ల సాగర్‌పిల్లా భరత నాట్య అరంగేట్రం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ ఆలేఖ్య పుంజాల, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డీటీ నాయక్ పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి సాగర్‌పిల్లా భరత నాట్య అరంగేట్రం ను ప్రారంభించి ఆశ్వీరదించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. శాస్త్రీయ కళలపట్ల అభిరుచి కల్పించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. పిల్లలకు శాస్త్రియ కళలు అందించడం ఎంతో అభినందనీయమన్నారు. సభకు ముందు సాగర్ పిల్లా ప్రదర్శించిన భరతనాట్య అరంగేట్రం వీక్షకులను ఆకుట్టుకున్నది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, వయోలిన్ వెంకటేశ్ కుప్పుస్వామి, మృదంగం మురళి తదితరులు పాల్గొన్నారు.

## రేపు గో రక్షణ కోసం వీహెచ్‌పీ చలో ఓల్డ్ సిటీ

సుల్తాన్ బజార్, జూన్ 1 : గోవుల రక్షణ కోసం ఈ నెల 2న చలో ఓల్డ్ సిటీ -ఆపరేషన్ గోమాత అనే పేరుతో భారీ కార్యక్రమం చేపడుతున్నట్లువిశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, గోరక్ష విభాగం రాష్ట్ర సహ ప్రముఖ్ రమేశ్, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గో అక్రమ రవాణా విషయంలో కొంతమంది పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించడం లేదని ఆరోపించారు.